

# సుంద మావయ్య

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ



దేవుడున్నాడని నమ్మవలసి వచ్చింది.

కష్టాలలో కమిలిపోయి కాదు

కన్నీళ్లలో కాగిపోయి కాదు

మా సుంద మావయ్య వంటి వ్యక్తిని సృష్టించడం ఆషామాషీ వ్యవహారం కాదని గ్రహించడం వల్ల....

సందేహం లేదు. ఇది దేవుడి పనే! చిన్నప్పటి నుంచి పెద్ద వాళ్లు చెప్పగా దేవుడి లీలలు చాలానే విన్నాను. సుంద మావయ్యొక ఫినామినన్. 'కష్టపడి పైకొచ్చిన వాళ్లు' అని కొందరి గురించి వింటూంటాం. దానినొక సుగుణంగా పూజించేవాళ్లని చూస్తూంటాం.

కోట్ల కొద్దీ ఆస్తులు కూడబెట్టిన ఒక మాజీ మంత్రి తన చిన్నప్పటి కష్టాల గురించి మురిపెంగా గుర్తు చేసుకోవడం నాకు తెలుసు.

మా సుంద మావయ్య కోట్లు సంపాదించలేదు గానీ, చక్కని ఇల్లు కట్టాడు. పరిమితికి మించ కుండా ఇద్దరు పిల్లల్ని కన్నాడు. అతి శ్రద్ధగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం మాత్రమేచేసి ఎప్పటికప్పుడు జీతాల పెరుగుదలలు, ఆదాయపు పన్నుల నుంచి బయటపడడానికి ప్రభుత్వం కల్పించే రకరకాల పత్రాల సదుపాయాలూ, ఏమారకుండా గమ నిస్తూ ఏ యెండకాసినప్పుడు ఆ ఆయా గొడుగులు వేసుకుంటూ సర్వీసు అంతా ''పాపం సుందరం మంచివాడు'' అనిపించుకొని బయటపడ్డాడు.

సుంద మావయ్య పాపం మంచివాడే! అయితే ఏది పాపం? ఏది మంచి?

ఎవరికీ అపకారం చెయ్యని మనిషి మావయ్య అయినా మా బంధువులు, ముఖ్యంగా మా అమ్మ పిన్ని లాంటి వాళ్లు ఆయనంటే ఎందుకు చిరాకు పడతారో మొదట్లో తెలిసేది కాదు. మావయ్య కూడికలలో కుబేరుడంతటి వాడు గనుక వీళ్లు సకా లంలో చీరలూ వగైరాలు దక్కక సణుగుకుంటార నుకునేవాడిని.

క్రమంగా నాకు వయస్సు పెరిగే కొద్దీ సుంద మావయ్య మానసిక సౌందర్యం నాకు బాగా అర్థం అయింది. అప్పటి నుంచీ ఒక వ్యక్తిగా కాక ఆయ న్నొక వ్యవస్థగా భావించి ఆయన చర్యల్ని చద వడం ప్రారంభించాను. చిన్నప్పటి నుంచీ ఆయన ప్రవర్తన గురించి కూపీ లాగడం ప్రారంభించాను.

పువ్వు పుట్టగానే పరిమళించడం ప్రకృతి సహజం. పరిమళం పువ్వుతనాన్ని సంతరించుకో వడం ఒక వైపరీత్యం.

మా సుంద మావయ్య ఒక వైపరీత్యం. అరిషడ్వ ర్గంలో లోభపరిమళం. మా మావయ్య రూపం సంతరించుకోవడం ఇక్కడ విశేషం.

''చూశావుగా! నా కొడుకు వెధవలు నన్ను లోభి అంటున్నారు. కృతఘ్నులు వీళ్లు. డబ్బు మంచినీళ్లలాగా ఖర్చు చేయడం గొప్ప కాదు. బిగ బట్టడమే గొప్ప! నది నీళ్లు వరదగా వున్నాయి కదా అని వదిలిస్తే, ఉప్పు సముద్రం పాలు! ఆనకట్ట కట్టడం గొప్ప. నేలైనా, నువ్వైనా సస్యశ్యామలం అయేది అప్పుడే. వీళ్లకి ఎడాపెడా తిండి పెట్టాను. కుంయ్ మంటే చాలు ఆరోగ్యం చెడుతుందేమోనని భయపడి మందులు దట్టించాను. ప్రతి పండక్కీ బట్టలు కుట్టించాను. నా శక్తిని బట్టి చదివించాను. కిష్టప్పగాడికి జీన్స్ కొనలేదని, సుబ్బాయి గాడికి స్కూటర్ కొనివ్వలేదని, మీ అత్తయ్యకి మిరియం గాజులు చేయించలేదని నేను లోభిని. అవును లోభినే. ఒప్పుకుంటే పోలేదూ?''

ఈ ధోరణిలో మావయ్య తర్కం నడిచేది. లోక సంగ్రహం ఎరిగిన ఎవరు మాత్రం కాదనగలరు? 'రిటరిక్' అంటారే, ఆ బాపతు సంభాషణా చాతుర్యం మావయ్యకుంది.

మా పిన్ని చెప్పింది. వాళ్లది ఆదిలో పేదరికానికి కొద్దిగా పై అంచుమీద వున్న కుటుంబమట. మా తాతగారు హైస్కూలు తెలుగు పండితుడు. ఆయ నెప్పుడూ తను పాండిత్యం కోసం ప్రాణాలిచ్చే మనిషినని తీవి వెలగబెట్టేవాడట. తన ముగ్గురు కొడుకుల్లో కనీసం ఒకడిని దేశం పట్టనంత పండితు

> **మా అమ్మమ్మ గోముఖ వ్యాఘ్ర మట. అంటే తప్పుడర్థంకాదు సుమా. గోవులాగా చల్లని చూపులు ప్రసరించినా, వ్యాఘ్రంలాగా మనో బలమూ, అవసరాన్ని బట్టీ కక్ష సాధించేయగల సమర్థురాలట.**

డిని చేస్తానని ప్రతిజ్ఞ పట్టాడట.

మా అమ్మమ్మ గోముఖ వ్యాఘ్రమట. అంటే తప్పుడర్థంకాదు సుమా. గోవులాగా చల్లని చూపులు ప్రసరించినా, వ్యాఘ్రంలాగా మనోబ లమూ, అవసరాన్ని బట్టీ కక్షసాధింపు, చేయగల సమర్థురాలట. (క్షమించాలి 'అట, అట' అంటు న్నాను, నేను వాళ్లని ఎరుగను గనుక)

మా ముగ్గురు మావయ్యలూ, మా తాతగారి ప్రతిజ్ఞ దెబ్బ ఎవరి మీద పడుతుందో అని భయ పడి చచ్చేవారట. అయితే ఈ ముగ్గురినీ మా అమ్మమ్మే కాపాడి ఒకడు కోర్టు గుమస్తా, రెండో వాడు ఇరిగేషన్ ఓవర్సీరు, మూడవాడైన సుంద మావయ్య ఇన్‌కమ్‌టాక్స్ సూపరింటెండెంట్ పద వులు అలంకరించేలాగా పాచికలు కదిపిందట.

మాతాతయ్య భార్యకు అరవై ఏళ్లు, పిల్లలకు నలభైఏళ్లు దాటిన సందర్భంలో సకాలంలో ఎవ రినీ ఇబ్బంది పెట్ట కుండా తన సాంసారిక బాధ్య తలన్నీ పూర్తి చేసు కొని కాలం చేశా రట.

మా సుందమా వయ్య కొడుకుల్లో చిన్నవాడు కావడం వల్ల తల్లి ప్రేమకు నోచు కుని, పావలా, అర్ధా డబ్బు లిచ్చినప్పుడు కడు జాగ్రత్తగా తన ట్రంకు పెట్టెలో దాచి తాళం కూడా వేసేవాడట.


ఆ తాళం చెవి మొలతాడుకు కట్టు కునేవాడు. గమ నిక : ఆ ఇంట్లో ఇంకే పిల్లలకి సొంత పెట్టెల్లేనేలే వని, మా అమ్మ కూడా చెప్పేది.

ఆ బాల వయ స్సు నుంచీ కూడా మా మావయ్యకి తిండి ధ్యాసగానీ, ఏ ఇతర వ్యసనాల ధ్యాసకానీ వుండేదికాదు. ఆంజనేయ గుప్తలాగా చలవకళ్ల జోడు కావాలని కానీ, గురవయ్య చౌదరిలాగా సబ్జాగింజలు కలిపిన ఐసు రంగు నీళ్లు తాగాలని కానీ, సుబ్రహ్మణ్యం లాగా గాలి పటాలెగరేయా లని కానీ, ఆశపడలేదు. ఆంజనేయ గుప్త తాతగా రిది వడ్డీ వ్యాపారం. ఆయనలాగా, చల్లని నాప రాళ్లు పరిచిన డాబా ఇంట్లో,నోట్లకట్టలు భుజం మీద తువ్వాలు చాటున పెట్టుకుని మౌనంగా ధ్యానంలో తిరగాలని వుండేది. 'సేకరణ తప్ప 'వితరణ' మహాపాపమనే సూక్తి మా మావయ్య రక్తంలో కలిసిపోయింది.

అలాగే బాల్యం గడిపాడు. ఒక చిల్లు కానీని అణా చేయడం ఎలా? అణాని రూపాయి చేయడం ఎలా? ఇదే ధ్యాస...

సుందమావయ్య పూర్తిగా రెండు వైపులా తెలుపు వుండే కాగితాలున్న నోటు పుస్తకాలు వాడ లేదు. ఒంటి పెడ కాగితాలవే. తల్లి వాడుకోమని బొంతలాంటి సబ్బు ఇచ్చినా దానిని మూడు ముక్కలుగా తరిగి వాడుకున్నాడు. ఇదంతా దారిద్ర్యం కారణంగా చేయలేదు. పొదుపు లక్ష్మీగా మాత్రమే చేశాడు. సొంతంగా హోటల్‌కెప్పుడూ పోలేదు. హైస్కూలుకైనా, డిగ్రీ కాలేజీకైనా నడిచే వెళ్లాడు. ఆటల జోలికెప్పుడూ పోలేదు. ఒక్కసారి మాత్రం ఎన్‌సిసిలో విధిగా చేరాలంటే వెళ్లాడు.






కానీ ఆ కమాండెంట్ మరుక్షణమే ఆయనకి నమస్కరించి కళ్లనీళ్లతో తిరిగి పంపేశాడు. లెఫ్ట్, రైట్ చెప్పి మా సుందమావయ్య చేత కాళ్లూ చేతులూ ఒక క్రమంలో కదిలింపజేయడంలో కమాండర్ విఫలమయ్యాడు. పోటీ పరీక్షలు రాసి మావయ్య కేంద్ర ప్రభుత్వోద్యోగి అనిపించుకున్నాడు. ఏ ఊళ్లో పనిచేసినా నిజాయితీగా పనిచేసి, అక్షరాలా ఇల్లూ, ఆఫీసూ తప్ప మరొక చోటికి పోతే ఒట్టు. ఆఖరికి హైదరాబాదు బదిలీ అయి పిల్లలు ఎదిగాక కూడా తన సిటీ బస్సు రూటు దాటిపోలేదు.

మా అత్తయ్య మాటల్లో చెప్పాలంటే... ''ఒరేయ్, మా ఆయన ఇల్లు పట్టకుండా తిరుగుతుంటా'రని చాలా మంది ఆడవాళ్లు ముచ్చటగా విసుక్కోవడం వినడమే కానీ, ఆ సంబడం నేనెరగను. సాయంకాలం ఆరుకొట్టేసరికి సూర్యుడైనా అస్తమించడం మరిచిపోతాడేమో కానీ, మీ మావయ్య ఇంట్లో వాలాల్సిందే. కాసేపు బయటకు పొమ్మని గెంటినా, వీధి చివర తచ్చాడి ఇంటికి రావడమే. ఏం చెయ్యాలన్నా డబ్బు రంధి. మాయ రంధి!

మా మావయ్యకి సరదాలు లేకకాదు. టీవి ఛానెళ్లల్లో సీరియళ్లు శ్రద్ధగా చూస్తాడు. అన్ని సినిమాలూ, టీవి మాధ్యమంద్వారానే చూస్తాడు. సినిమా పాటలు వింటాడు.

సుందమావయ్యకొకక బలహీనత. చిన్నప్పటి నుంచీ వుండేదట. ఏ పాట విన్నా అది ఏ రాగమని సంగీతం తెలిసిన మిత్రుల్ని సలపరించే అలవాటుంది. అది తేలే వరకు ఊరుకోడు. అక్కడ నుంచి అది పహాడ్, ఇంది పంతువరాళి, అదిగో మాండ్, ఇదిగో భీంప్లాస్, అయ్యారే సింధుభైరవి, మరుఘూరే మాల్కోస్ అంటూ స్వైర విహారం అలవాటు. ఆ విధంగా లలిత కళారంగంలో ప్రవేశం వుంది కానీ, దానిని మించి పరవశం జాస్తి.

సుందమావయ్యలో సుగుణాలను దాచడం నా వుద్దేశం కాదు. మంచి భోజనప్రియుడు. తను తింటాడు. తప్పని సరి బంధువులకు పెడతాడు. మా అత్తయ్య మాట గౌరవిస్తాడు. ఆవిడ ఖర్చుల్ని సైతం గౌరవిస్తాడు.

మా పిన్ని మరీనూ! 'ఒరేయ్, మీ మావయ్య జీతమెంతో చెప్పించరా నీకు నేను వెయ్యిరూపాయలిస్తాను' అంటూంటుంది. నేనే కాదు. ఎందరెందరో ప్రయత్నించి విఫలురయ్యారు. ఎప్పుడూ సంసార భారంతో చితికిపోయిన స్థితిలో వున్నానే అంటూంటాడు.

సుందమావయ్య ఎవరికీ ఎప్పుడూ అపకారం చెయ్యలేదు. ఎందుకంటే ఏదో దశలో, పాపభీతితో ఎవరికైనా ఉపకారం చెయ్యవలసి వస్తుందని...

మావయ్యలో చిత్రం ఏమంటే, పిల్లలు పెళ్లిళ్లయి, వాళ్ల సంసారాలతో వాళ్లు స్థిరపడి ఎవడి వైభవంలో వాడున్నా, తను మాత్రం చితికిపోయి వున్నానని నమ్మడానికి అలవాటుపడిపోయాడు.

ఆయన ఎవరికీ ఫోనులు చెయ్యడు. శుభమైనా, అశుభమైనా, గ్రీటింగులు చెప్పడం, పంపడం వంటి మూఢవిశ్వాసాలు లేవు. తను ఎవరినీ కాఫీ హోట్లళ్లకు సినిమాలకు ఆహ్వానించడు. ఎవరైనా ఆహ్వానిస్తే, ఉభయఖర్చులూ పిలిచిన వారివే. జేబులోంచి చేతులు తియ్యడు. బంధువులతో కలిసి ఎప్పుడైనా ఆటోల వంటి స్వయం చాలిత వాహనాలెక్కితే, మొత్తం చార్జి తీసుకొని తన జేబు క్యాలిక్యులేటర్ ద్వారా గణించి తన షేరు చెల్లించేస్తాడు.

నాకు బుద్ధెరిగిన నాటి నుంచి సుందమావయ్య దేవుడిని గురించి పట్టించుకోగా ఎరగను. పట్టించుకుంటే మొక్కుబడులనీ, పూజలనీ, సామాగ్రి అనీ, పురోహితులనీ, హుండీలనీ ఎన్నో దిక్కుమాలిన ఖర్చులు... అని ఆయన వుద్దేశం అని విన్నాను.

ఇటీవల కొన్నేళ్లుగా దూరదేశంలో వుండిపోవడం వల్ల ఆయన గురించి ఎక్కువ విషయాలు తెలుసుకునే అవకాశం లేకపోయింది.మొన్న ఉగాదికి వచ్చినప్పుడు విన్నాను. వయస్సు మీదపడ్డాక ఈ 'బ్రహ్మ', ' ఆత్మ' అనేవి వున్నాయా? వుంటే వాటి సంగతి తెలుసుకునేది ఎలాగా? బ్రహ్మజ్ఞానం కలవాడికి మోక్షం వస్తుందట. ఎవరు ఫలాపేక్షరహితంగా బోధిస్తారు? అని ఉప్మాలో జీడిపప్పు, అల్లం ముక్కలు ఏరుకుతింటూ తరచుగా 'వర్రీ' అవుతున్నాడట.

అలా కాసేపాగండి

దేవుడు అద్భుతమైన ఈ చరాచర సృష్టి సర్వం నిర్మించాక, మిగిలిపోయిన కొన్ని విపరీత గుణాలతో కొన్ని నమూనాల్ని తయారు చేసి అక్కడక్కడ వెదజల్లాడట. మా సుందమావయ్య ఆ నమూనాల్లో ఒకడు.

అందుకే

దేవుడున్నాడని నమ్మవలసి వస్తోంది.

★